సాక్షి
చిత్తూరు

శనివారం । 20 । జులై । 2024



ఆదాయానికి డ్రాగన్

పండ్ల తోటల సాగులో కొత్తరకం వాటిపై రైతులు దృష్టి సారించి మంచి ఫలితాలు పొందుతున్నారు. - 8లో



కాలువ పూడ్చి.. అక్రమ నిర్మాణం

బోయకొండ వద్ద గంగాపురంలో ప్రభుత్వం స్థలం ఆక్రమించి అక్రమ నిర్మాణం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. - 8లో



చోరీ బైకులు అప్పగింత

ఘరానా దొంగ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లను బాధితులకు అప్పగించారు. - 8లో

న్యూస్‌రీల్

ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా దొరస్వామి



కుప్పం: ద్రవిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య దొరస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఉన్న వీసీ తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో దొరస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన ఆయన..వర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది ఆయన్ను కలిశారు.

మిగులు టీచర్లను సర్దుబాటు చేయారూ!

–డీఈఓకు పీఆర్‌టీయూ నేతల వినతి



డీఈఓతో చర్చిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో ఉన్న మిగులు టీచర్లను అవసరమున్న బడులకు సర్దుబాటు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు గిరిప్రసాద్‌రెడ్డి కోరారు. శుక్రవారం డీఈఓ దేవరాజును అసోసియేషన్ నేతలతో కలిసి ఆయన వినతిపత్రం వచ్చారు. పలు డిమాండ్లపై ఆయనతోపాటు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామికణ్ణన్ చర్చించారు. జిల్లాలోని ఉన్నత పాఠశాల్లో ఉండాల్సిన టీచర్లకంటే ఎక్కువగా పలుచోట్ల ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి సమీపంలో ఖాళీగా ఉన్న ప్రాంతాలకు సర్దుబాటు చేయాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరు ఆలస్యం వల్ల టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్‌ఓసీకి దరఖాస్తు చేసుకున్న టీచర్లకు త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. రివర్షన్ కోరుకుంటున్న ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంల అభ్యర్థనలను పరిశీలించాలన్నారు. యూడైస్ ప్లస్‌లో నమోదు చేసినప్పటికీ అటెండెన్స్ యాప్‌లో విద్యార్థుల పేర్లు చూపించడం లేదని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఆ సమస్య ఉందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. అనంతరం అసోసియేషన్ నాయకులు ట్రెజరీ, ఏపీజీఎల్ఐ అధికారులను కలిసి టీచర్ల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, శంకర్, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ ఆదేశాలకు మేరకు 2024–25 విద్యా సంవత్సారానికి సంబంధించి పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్ హెచ్ఓ ప్రభావతి తెలిపారు. మహిళలతో పాటు పురుష అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇంటర్మీడియెట్‌లో 40శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. సైన్స్ గ్రూప్‌లో ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఉచిత ప్రవేశం కోసం www.apsahpc.co. in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారం, విద్యార్హత నకలు పత్రాలు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100 జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, రెడ్డిగుంట, చిత్తూరు నగరం అనే చిరునామాకు ఆగష్టు 6వ తేదీ లోపు చేర్చాలని ఆమె తెలియజేశారు.

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన తహసీల్దార్లు మళ్లీ సొంత జిల్లాలకు తిరిగి వచ్చేందుకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కర్నూలు, అనంతపురం, వైఎస్‌ఆర్ కడప జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు తిరిగి చిత్తూరు, తిరుపతి జిల్లాలకు రానున్నారు. అయితే బదిలీపై వస్తున్న తహసీల్దార్లకు సొంత రెవెన్యూ డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు పకడ్బందీగా కసరత్తు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 67 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ప్రస్తుతం వారందరూ సొంత జిల్లా కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకోనున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న తహసీల్దార్లు సైతం వారి సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు. రిపోర్టు చేసుకున్న తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చేందుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపట్టనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

అధైర్యపడొద్దు!

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి భరోసా
- నష్టపోయిన ప్రతి కార్యకర్తకు ఆర్థిక సాయం
- టీడీపీ మూకల దాడుల్లో నష్టపోయిన వారిని గుర్తించేందుకు కమిటీలు
- కేసులు పెట్టినా తానే చూసుకుంటానని హామీ
- దాడులు చేస్తే కేసులు పెట్టండి..
- పట్టించుకోకపోతే కోర్టు ద్వారా ప్రైవేటు కేసులు
- కలిసికట్టుగా కూటమి మూకల దాడులను ఎదుర్కోవాలని పిలుపు

సాక్షి ప్రతినిధి, తిరుపతి/సదుం: టీడీపీ మూకల అరాచకాలు, విధ్వంసాలపై న్యాయపోరాటం చేసేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సిద్ధమయ్యారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు రెండు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సదుం మండలం, యర్రాతివారిపల్లెలో పుంగనూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. టీడీపీ మూకల దాడుల్లో తీవ్రంగా నష్టపోయిన వారిని, భయంతో ఊరొదిలి వెళ్లిన వారిని పిలిపించుకుని వారికి భరోసా కల్పించారు. మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ గత కొద్ది రోజులుగా కూటమి మూకలు చేస్తున్న దాడులు, దౌర్జన్యాల గురించి ప్రస్తావించారు.

ఐకమత్యమే మహాబలం

పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల,పులిచెర్ల, సదుం, సోమల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఎంపీ విడివిడిగా సమావేశమయ్యారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఐకమత్యంగా ఉంటే ఎవ్వరూ ఏమీ చేయలేరని పిలుపునిచ్చారు. పచ్చ మూకల దాడుల్లో ఆస్తి నష్టం కలిగిన ప్రతి కార్యకర్తకూ తాను సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా బాధితులను గుర్తించి వారికి సాయం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. తప్పుడు కేసులకు భయపడాల్సిన పనిలేదని, ఆ కేసులన్నీ తాను ఎదుర్కొంటానని హామీ ఇచ్చారు. అన్యాయంగా తనపై, మాజీ ఎంపీ రెడ్డెప్పపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడనని, తనను నమ్ముకున్న కార్యకర్తలను వదిలేది లేదన్నారు. ఎక్కువ సమయం ప్రజల మధ్య ఉంటానని పేర్కొన్నారు. ఇంటింటా పర్యటిస్తానని తెలిపారు. గ్రామాలలో దౌర్జన్యాలు చేయడానికి వచ్చే వారిపై భయపడకుండా అందరూ కలిసికట్టుగా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ మద్దతుదారులపై తప్పుడు కేసులు పెడితే వారికి ఆర్థిక భారం కలగకుండా న్యాయపోరాటం చేసేందుకు తాను సహకరిస్తానన్నారు. దౌర్జన్యాలు చేసే వారిపై కేసులు పెట్టాలని, స్టేషన్‌లో వాటిని తీసుకోకపోతే తన దృష్టికి తెస్తే ప్రైవేటు కేసులు నమోదు చేయిస్తానన్నారు. దౌర్జన్యాలను మౌనంగా సహిస్తుంటే మరింతగా రెచ్చిపోతారని, ఆ అవకాశం ఇవ్వరాదని చెప్పారు. ఈ ఐదేళ్లు ఏ సహాయం కోసం అయినా తనని సంప్రదించవచ్చన్నారు. 90 శాతం పనులకు ప్రభుత్వ సహాయం అవసరం లేదని, తాను చేయించగలనని అన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు నిలిపివేస్తే కోర్టుకు పోతామన్నారు. ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు ఫ్యాక్టరీలను తీసుకొస్తే వాటిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో టీడీపీ నియోజకవర్గ అభివృద్ధిపై వివక్షచూపితే ఎంపీ నిధులతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు నియోజకవర్గాన్ని వారు అభివృద్ధి చేయరని, కక్ష్య సాధింపులే వారికి అవసరమని తెలిపారు. ఎంపీ నిధులతో సాధ్యమైనంత మేర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కూటమి మూకల దాడులతో తీవ్రంగా నష్టపోయిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి భరోసా నిచ్చారు. బెదిరింపులకు బెదరొద్దని, కలిసికట్టుగా నిలబడితే ఎవ్వరూ 'టచ్' చేయలేరని తేల్చిచెప్పారు. కూటమి మూకల దాడుల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆర్థికంగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అందులో భాగంగా శుక్రవారం సోమల మండలం, కమ్మపల్లిలో టీడీపీ నేతల దాష్టీకానికి తీవ్రంగా నష్టపోయిన సుబ్రమణ్యంరెడ్డి కుటుంబానికి తక్షణం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ ఆదుకునేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కూటమి మూకల దాడులకు తెగబడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఒకవేళ వారు కేసు నమోదు చేయకపోతే ప్రైవేటు కేసులు వేసి వారికి శిక్షపడేంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు.

సంక్షేమ పథకాల అమలు కష్టమే

కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేసే విధానంపై ఎంపీ మిథున్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. పలువురి పింఛన్లను తొలగించే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులకు సంబంధించి సీఎంకు తెలియకుండా జీపీఎస్ జీఓ ఎలా బయటకు వస్తుందని ప్రశ్నించారు. అమ్మకు వందనం, రైతు భరోసా ఎప్పటికి అందుతాయో స్పష్టత లేదన్నారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ఎర్రాతివారిపల్లెలో నిర్వహించిన సమావేశానికి అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. వారి సమస మస్యలను పేరు పేరున ఎంపీ అడిగి తెలుసుకున్నారు. పార్టీ మద్దతుదారులకు ఏ కష్టం వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని, 24 గంటలు తమ కుటుంబ సభ్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నాయకులు అభిప్రాయ బేధాలను పక్కనబెట్టి ఐకమత్యంగా ఉండాలన్నారు. లోపాలను సరిచేసుకుని మరింతగా పటిష్టం చేసుకుందామన్నారు. లాభమైనా, నష్టమైనా కలిసి పోరాడే వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, పులిచెర్ల ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, నాదమునిరెడ్డి, ఇబ్రహీం ఖాన్, రెడ్డిశ్వర్‌రెడ్డి, అమాసమోహన్, నాగేశ్వరరావు, రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కల్యాణ భరత్, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎంపీకి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

టీడీపీ కార్యకర్తల్లారా.. కళ్లు తెరవండి

'చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల్లారా.. కళ్లు తెరవండి.. పులివర్తి నాని వ్యాపారాలకు గత ఐదేళ్లు నేను గానీ, అప్పటి మా ప్రభుత్వ మంత్రి పెద్దిరెడ్డి గారు గానీ ఎటువంటి ఇబ్బందులు కలిగించలేదు. నానిపై ఏనాడూ ఏ కేసూ పెట్టలేదు. పులివర్తి నాని క్వారీపై తనిఖీలకు వెళుతుంటే స్వయంగా మైనింగ్ అధికారులతో నేనే మాట్లాడి నిలుపుదల చేయించాను.. ఇది వాస్తవం..' అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

- నానీపై ఏనాడూ..ఏ కేసూ పెట్టలేదు
- ఆయన వ్యాపారాలకు పెద్దిరెడ్డి, నేను సహకరించాం
- మమ్మల్ని విలన్లుగా చూపించి పదవులు పొందాలనుకుంటున్నారు
- కిలారి రాజేష్ పేరు చెప్పుకుని దందాలు చేయడం న్యాయమా?
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రవర్తించిన తీరును పవర్ ప్రజెంటేషన్ ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుచానూరు (చంద్రగిరి): 'టీడీపీ అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లో చంద్రగిరి నియోజకవర్గంలో 34 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. అర్ధరాత్రిపూట ముసుగులు వేసుకొచ్చి కొడుతున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పల్లెల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు' అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి శిల్పారామం సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లు పల్లెల్లో ఒక చిన్న రాజకీయ గొడవకు కూడా అవకాశం లేకుండా పరిపాలన సాగించానని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. కరోనా సమయంలో చంద్రగిరి ఎమ్మెల్యేగా తాను కులం, మతం, పార్టీ అన్న తేడాలు లేకుండా అందరినీ కంటికి రెప్పలా కాపాడానన్నారు. అయితే అందుకు భిన్నంగా నేడు రౌడీయిజం రాజ్యమేలుతోందని విమర్శించారు.

నానీని ఇబ్బందులు పెట్టలేదు

'నానీకి చెందిన స్టోన్ పాలింగ్ ఇండస్ట్రీకి విద్యుత్ బకాయిలు కట్టకపోయినా ఫ్యాక్టరీ ఐదేళ్లు కొనసాగింది. నానీ బంధువు గిరినాయుడు పాకాలలో 8 హెక్టార్ల బ్లాక్ గ్రానైట్ ఫ్యాక్టరీ తీసుకున్న మాట వాస్తవం కాదా?. నానీకి సంబంధించిన ఏ క్వారీకీ, ఆయన చెప్పిన ప్రతి క్వారీకీ ఐదేళ్లలో పర్మిషన్లు ఆగలేదు. నానీకి సంబంధించిన హోసూరు, చెన్నైకి తరలించే 12 గ్రానైట్ ట్రాన్స్‌పోర్టు లారీలు ఒక్కరోజైనా ఆగాయా? చిత్తూరులో నానీకి సంబంధించిన రెండు పెద్ద క్వారీలు ఐదేళ్లలో ఒక గంటయినా మూశారా..? ఎన్నికలకు ముందు మీ క్వారీలకు ఫైన్ వేసినట్టు, స్టే తెచ్చుకున్నట్టు ఆడింది నాటకం కాదా? ఈ విధంగా ఐదేళ్ల వ్యాపారాలకు, మీ ఆదాయాలకు మమ్మల్ని వాడుకుని ఈరోజు విలన్లుగా చూపించి పదవులు మీరు పొందాలని చేస్తున్న ప్రయత్నం నిజం కదా..? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పెద్దిరెడ్డిని, నన్ను వాడుకున్న మాట వాస్తవం కదా?. ప్రతి నిత్యం లోకేష్ సన్నిహితుడు కిలారి రాజేష్ పేరు చెప్పుకుని చంద్రగిరిలో దందాలు, అధికారులకు బెదిరింపులు చేయడం తప్పుకదా?. ఈ రోజు మీకు ఏ రకమైన గాయం తగల్లేదని స్విమ్స్ వైద్యులు ఇచ్చిన రిపోర్టు నిజమే కదా?' అని చెవిరెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో నంది అవార్డులు ఇస్తే పులివర్తి నాని నటనకు మొదటి అవార్డు ఇవ్వాలన్నారు. నాయకుడనే వ్యక్తికి నిబద్ధత ఉండాలనీ, మాటలో, ప్రవర్తనలో స్పష్టత, పెద్దరికం ఉండాలన్నారు. డ్రామా లు నాటకాలతో గడిపే వ్యక్తి నాయకుడెలా అవుతాడని ప్రశ్నించారు.

నా కార్యకర్తల కోసం ఎందాకైనా..

''ఇకపై వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక్క కార్యకర్తపై చేయివేసినా ఊరుకోం. కొత్తగా ఎమ్మెల్యే అయిన వారికి పరిపాలించే అవకాశం ఇద్దామనుకున్నా. బయటకు వెళ్లి వ్యాపారం చేసుకుందామనుకున్నా. కానీ నన్ను నమ్మిన పార్టీ కేడర్‌ను ప్రతిరోజూ కొడుతూ ఉంటే ఉండలేక పోతున్నా. అందుకే ఇకపై పూర్తి సమయం కేడర్ తోనే ఉండాలని నిర్ణయించుకున్నా. ప్రతిపక్షంలో నా పోరాటం ఎలా ఉంటుందో తెలిసేలా చేస్తా. నా కార్యకర్తల జోలికి వస్తే వారికి వడ్డీతో సహా చెల్లించుకుంటాం'' అని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు.

వేంకటేశ్వరస్వామికి ఆభరణాల సమర్పణ



ఆభరణాలను అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు ఈశ్వరగుడివీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం విజయకుమార్ కుటుంబ సభ్యులు పంచలోహం, బంగారుపూత వేయించిన రూ.3లక్షల విలువైన ఆభరణాలను సమర్పించారు. దాత మాట్లాడుతూ తాము విదేశాల్లో ఉన్నప్పటికీ స్వామిపై ఉన్న అపారభక్తే ముందుకు నడిపిస్తోందని, ఆయన అనుగ్రహం వల్లే ఈ ఆభరణాలను అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆభరణాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు. కార్యక్రమంలో అర్చన, స్మృతి, సరై విజయ్, శ్రీమన్నారాయణ, అర్చకులు తులసి పాల్గొన్నారు.

బొజ్జరెడ్డిని పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం



పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : మండలంలోని పాతగుంటలో ప్రత్యర్థి మునీంద్ర చేతిలో దాడికి గురై తీవ్రంగా గాయపడి తిరుపతి రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొజ్జరెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం పరామర్శించారు. హతమార్చాలనే ఉద్దేశంతోనే దాడి చేశారని తెలుసుకుని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బొజ్జరెడ్డి కుటుంబానికి అన్ని విధాలా పార్టీ, తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యాక్షుడు రామయ్య, జెడ్పీటీసీ సుకుమార్, జిల్లా సీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య తదితరులు పరామర్శించారు.

22న జిల్లా స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 22న ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ విభాగంలో పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఆగస్టు 10 నుంచి 12వ తేదీ వరకు పల్నాడు జిల్లా వినుకొండలో రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్టు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజనల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో స్థానిక క్రీడా మైదానానికి రావాలని ఫిజికల్ డైరెక్టర్ దేవా తెలిపారు. మరిన్ని వివరాలకు 7013989059, 9581887409 సెల్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

దేవుడా! ఎందుకింత గర్భశోకం?

–తీవ్ర విషాదం నింపిన రోడ్డు ప్రమాదం



జయచంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

ఐరాల: 'దేవుడా.. మేమేమి పాపం చేశాం? మాకెందుకింత శిక్ష వేశావు..! నలుగురు బిడ్డల్ని ఎలా సాకేది? కడుపులో ఉన్న నలుసుని ఎలా పెంచేది..?' అంటూ గుండెలు బాదుకుంటూ ఆ గర్భవతుల రోదన పలువురికీ కంటతడి పెట్టించింది. ఈ విషాద ఘటన మండలంలోని గుండ్లపల్లె సిద్ధగిరిక్షేత్రం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. పాకాల మండలం, దామలచెరువు సమీపంలోని పత్తిపాటివారిపల్లె అక్కగార్ల ఆలయం వద్ద గురువారం రాత్రి లారీ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. వారిలో ఐరాల మండలం, గుండ్లపల్లె సిద్ధగిరి క్షేత్రం ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్ర(30), నారాయణ(25), చుక్కావారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన నాగేంద్ర(14) ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు స్వగ్రామానికి తరలించారు. ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్రకు నలుగురు పిల్లలు కాగా.. ప్రస్తుతం భార్య గర్భవతి. నారాయణ భార్య నాగమణి కూడా గర్భిణి. నాగేంద్ర కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇక తీవ్రగాయాలైన ఎస్టీ కాలనీకి చెందిన మనోజ్ కొత్తకోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం మృతదేహాలు వారి స్వగ్రామాలకు చేరడంతో కుటుంబీకులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. నారాయణ అంత్యక్రియలు రొంపిచెర్లలో నిర్వహించగా.. నాగేంద్ర, జయచంద్ర అంత్యక్రియలు చుక్కావారిపల్లె ఎస్టీ కాలనీలో నిర్వహించారు.

ప్రశాంత్ నగర్‌లో ఫ్రైడే... డ్రైడే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వైద్య ఆరోగ్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ దోమల వ్యాప్తి నివారణకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. శుక్రవారం చిత్తూరులోని ప్రశాంత్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో నిర్వహించిన ఫ్రైడే..డ్రైడే కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. దోమ కాటు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఆదాయానికి డ్రాగన్

పండ్ల తోటల సాగులో కొత్తరకం వాటిపై రైతులు దృష్టి సారించి మంచి ఫలితాలు పొందుతున్నారు. ఇప్పటివరకు జిల్లాలో పండ్లతోటల సాగు అంటే ప్రధానంగా ఎక్కువగా ఉన్నది మామిడితోటలే. వీటి కంటే అధిక ఆదాయం వచ్చే ఇతరత్రా పండ్ల తోటలపై రైతుల మక్కువ పెరగడంతో ఇప్పుడు డ్రాగన్ సాగుతో మంచి ఆదాయం కళ్లజూస్తున్నారు. ఈ పండ్లలో అధిక పోషకాలు, యాంటీ యాక్సిడెంట్లు ఉండడంతో ప్రజలు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. ఎక్కడో మెక్సికో, సెంట్రల్ అమెరికాలో పుట్టిన ఈ పంట మన రాష్ట్రంలోపాటు పల్లెలకూ చేరింది. దీని సాగుకు గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద రైతులకు హెక్టారుకు రూ.30 సబ్సిడీని సైతం అందజేసి ప్రోత్సహించింది.

- కొత్త పండ్ల తోటలపై రైతాంగం దృష్టి
- ఒకసారి నాటితే 10 ఏళ్ల పాటు దిగుబడి
- ఎకరాకు రూ.6 లక్షల నికర ఆదాయం



తడుకుఆర్‌ఎస్ వద్ద సాగవుతున్న డ్రాగన్ ఫ్రూట్ పంట



డ్రాగన్ ఫ్రూట్స్

పుత్తూరు: డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు నాటిన 8 నెలల తర్వాత పూత వస్తుంది. తొలి ఏడాది ఎకరాకు ఒక టన్ను దిగుబడి వస్తే, రెండవ ఏడాది నుంచి 4 టన్నుల వరకు దిగుబడి పెరుగుతూ పోతుంది. ఎకరా భూమిలో 8 అడుగులకు ఒక రాతి స్తంభం చొప్పున నాటి, ఒక్కో స్తంభానికి నలు వైపులా 4 మొక్కలు నాటుకోవచ్చు. రాతి స్తంభాల వరుస, వరుసకు 10 అడుగుల దూరం ఉండాలి. ప్రతి రాతి స్తంభంపైన పాత టైరును ఏర్పాటు చేసుకోవాలి. ఎకరాలో 400 స్తంభాలు అవసరమవుతాయి. వీటికి మొత్తంగా 1600 మొక్కలను నాటుకోవచ్చు. ఇందుకుగాను రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. జనవరి, ఫిబ్రవరిలో పంట సాగు చేస్తే జూన్, జూలై మాసాల్లో పూత వస్తుంది. అయితే తొలి ఏడాదిలో పెద్దగా పంట చేతికి అందకపోయినా రెండవ ఏడాది నుంచి దిగుబడి 4 టన్నుల వరకు వస్తుంది. టన్ను డ్రాగన్ ఫ్రూట్ ధర రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతోంది. దీంతో ఎకరాకు రూ.6 లక్షల నుంచి 8 లక్షల వరకు ఆదాయాన్ని రైతులు పొందుతున్నారు. రెండవ ఏడాది నుంచి ఎకరాకు రూ.50 వేలు వంతున సస్య రక్షణ చర్యలు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఇలా తక్కువ ఖర్చుతో కనీసం 10 నుంచి 15 ఏళ్ల పాటు నికర ఆదాయం అందుకోవచ్చు.

అటు పట్టణాలకు ఎగుమతి.. ఇటు తోటల వద్దే కొంటున్న వ్యాపారులు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పుత్తూరు, వడమాలపేట, విజయపురం మండలాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగవుతోంది. పుత్తూరు మండలంలో టీఆర్‌కండ్రిగ, తడుకు, వడమాలపేట మండలంలోని తడుకు రైల్వేస్టేషన్, ఏఎంపురం, విజయపురంలో ఈ పంట సుమారు 15 ఎకరాల్లో సాగవుతోంది. ఇక్కడ నుంచి డ్రాగన్ ఫ్రూట్స్‌ను హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడలకు ఎగుమతి చేస్తున్నారు. దీనికి మంచి గిరాకి ఉండడంతో వ్యాపారులే తోటల వద్దకే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. దీంతో రైతుకు రవాణా ఖర్చులు సైతం మిగులుతోంది.

ఇది లాభదాయక పంట



తడుకు ఆర్‌ఎస్ వద్ద రెండెకరాల్లో డ్రాగన్ పండిస్తున్నాను. ఇప్పటికే రెండు దఫాలుగా విక్రయించాను. ఇతర పంటలతో పోలిస్తే డ్రాగన్ సాగు లాభదాయకంగానే ఉంది. పంట సాగు ప్రారంభంలో ఎకరాకు రూ.4 లక్షలు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. తర్వాతి ఏడాది నుంచి ఏడాదికి రూ.50 వేలు వరకు ఎరువు, మందులకు ఖర్చు అవుతుంది. కనీసం పదేళ్ల వరకు నికర దిగుబడి వస్తుందని నమ్మకంతో ఉన్నా.

– రాజేంద్రవర్మ, రైతు, తడుకు ఆర్‌ఎస్, వడమాలపేట మండలం

కొత్త పంట సాగు చేయాలని..



సాంప్రదాయ పంటలే కాకుండా కొత్త రకం పంటలను సాగు చేయాలనే ఆలోచనతో డ్రాగన్ సాగు చేశాను. తొలి ఏడాదే కాబట్టి పూత వచ్చి కొంత భాగం రాలిపోయింది. అయినా దిగుబడి ఆశించిన మేరకు వస్తోంది. ధర సైతం ఆశాజనకంగానే ఉంది. రీటైల్ అమ్మకాల ద్వారా మరింత ఆదాయం అందుకోవచ్చు. పంట తక్కువ ఉండడంతో డిమాండ్ బాగుంది. పుత్తూరు, నగరి వంటి చిన్న పట్టణాల్లో సైతం డ్రాగన్ పండ్లను ప్రజలు కొంటున్నారు.

-ఎస్.రామచంద్రరాజు, రైతు, తడుకు ఆర్‌ఎస్, వడమాలపేట మండలం


పదేళ్లపాటు నికర ఆదాయం



ఒకసారి డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తే కనీసం పదేళ్ల పాటు నికర ఆదాయాన్ని పొందవచ్చు. పుత్తూరు, వడమాలపేట మండలాల్లో మూడేళ్లుగా ఈ పంట సాగవుతోంది. ప్రభుత్వం సైతం మొక్కలు, ఎరువులకు కలిపి హెక్టారుకు రూ.30 వేలు సబ్సిడీని ఇచ్చి ప్రోత్సహిస్తోంది. తొలి ఏడాది ఖర్చులో కేవలం పది శాతం ఖర్చు మాత్రమే ఇతర ఏడాదుల్లో వ్యయం చేయాల్సి ఉంటుంది. ఏటా నికర ఆదాయం పొందవచ్చు.

–వెంకట సౌజన్య, హార్టికల్చర్ ఆఫీసర్, పుత్తూరు

విరగ్గాసిన బొప్పాయి



కుమారస్వామి పొలంలో బొప్పాయి చెట్ల నిండుగా కనిపిస్తున్న కాయలు

ఓ రైతు పంట పడింది. బొప్పాయి తోటలో చెట్టు మొదటి నుంచి కొన వరకు కాయలతో నిండుగా కనిపిస్తుండడంతో చూపరులను ఇట్టే ఆకర్షిస్తోంది. కుప్పం మండలం కొత్త యిండ్లులో ఆదర్శ రైతు కుమారస్వామి తనకున్న 2 ఎకరాల్లో బొప్పాయి తోట సాగు చేశాడు. దీనికి రెండు లక్షల రూపాయలు వ్యయం చేశాడు. సస్యరక్షణ చర్యలు పాటించాడు. ప్రస్తుతం తోటలో కాయలు పెద్ద ఎత్తున కాశాయి. మంచి ఆదాయం వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశాడు.

– కుప్పం రూరల్

శిక్షణతో బోధన సామర్థ్యాల పెంపు

తిరుపతి డీఈఓ శేఖర్



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు: క్షేత్ర స్థాయిలో విద్యా బోధనల్లో మార్పు స్పష్టంగా కనిపించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. డీఈఓ మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో గ్రహించిన, ఆకళింపు చేసుకున్న విషయాలతో బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తద్వారా విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేలా పాఠాలు బోధించాలన్నారు. 9 రోజుల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, శిక్షకులు రమేష్, బాలసుబ్రమణ్యం, హిమగిరి, వేణుగోపాల్, పుత్తూరు, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు, వడమాలపేట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దుప్పి మృతి



ప్రమాదంలో మృతి చెందిన దుప్పి

గంగవరం: కారు ఢీకొని దుప్పి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాలు.. మండలంలోని గజారామం ఫారెస్ట్ సమీపంలోని గోవిందశెట్టిపల్లె వద్ద రోడ్డు దాటుతున్న రెండేళ్ల వయసున్న దుప్పిని కారు ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దుప్పి అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న ఫారెస్టర్ సురేంద్ర, బీట్ ఆఫీసర్ రాధన్న అక్కడికి చేరుకుని పరిశీలించారు. దుప్పి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి నిర్వహించి గజారామం వద్ద దహనం చేశారు.

చోరీ బైకులు అప్పగింత



బాధితులతో ఏఎస్పీ ఆరిఫుల్లా, డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

పూతలపట్టు: ఘరానా దొంగ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లను శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితులకు అప్పగించారు. ఇటీవల నెల్లూరు జిల్లాకు చెందిన సందీప్(24)ను పోలీసులు అరెస్ట్ చేసి, అతడు నాలుగు జిల్లాల్లో చోరీ చేసి దాచి ఉంచిన 50 మోటార్ సైకిళ్లను రికవరీ చేయడం, దీనిపై 'దొంగమేస్త్రీ' శీర్షికతో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించడం విదితమే. రూ.45లక్షల విలువైన ఈ మోటార్ సైకిళ్లకు సంబంధించి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదై ఉన్నాయి. ప్రస్తుతం 15 మంది బాధితులకు జిల్లా అడిషనల్ ఎస్పీ ఆరిఫుల్లా చేతుల మీదుగా ద్విచక్రవాహనాలను అందజేశారు. మిగిలిన వాహనాలు కేసు నమోదు చేసిన పోలీస్ స్టేషన్లలో అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సుదర్శన ప్రసాద్, కాణిపాకం ఎస్‌ఐ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మరింత జోరుగా ఉపాధి



తనిఖీ వివరాలను తెలియజేస్తున్న డీఆర్‌పీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉపాధి హామీ పనులను మరింత జోరుగా చేపట్టాలని డ్వామా పీడీ రాజశేఖర్, ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, ఎంపీపీ గీతాలు సూచించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం తాము వారం రోజులు పర్యటించి సేకరించిన వివరాలను బహిరంగ సభలో వెల్లడించింది. ఉపాధి హామీ పథకం కింద 17 పంచాయతీల పరిధిలో కూలీల వేతనాలకు రూ.3.25 కోట్లు, మెటీరియల్‌కు రూ.1.35 కోట్లు వ్యయం చేసినట్లు డీఆర్‌పీలు తెలిపారు.అందులో వ్యయ గణాంకాల్లో తప్పులు ఉండడంతో రూ.9,721లు రికవరీగా చూపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు జయరామ్, రంజని పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరైన టీచర్‌పై వేటు

- ఉత్తర్వులు జారీచేసిన డీఈఓ దేవరాజు
- 21 నెలలుగా హాజరు కాని వైనం!

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఐరాల మండలం మద్దిపట్లపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేసే టీచర్ చక్రవర్తి దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరు కావడంతో సస్పెండ్ చేస్తూ డీఈఓ దేవరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు.. చక్రవర్తి 2022 సంవత్సరం అక్టోబర్ 22వ తేదీ నుంచి బడికి గైర్హాజరయ్యారు. ఎలాంటి సెలవుకూ ఆయన దరఖాస్తు కూడా చేయలేదు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. ఉత్తర్వులు అందజేసేందుకు సంబంధిత చిరునామాలో టీచర్ లేకపోవడంతో తన ఎదుట హాజరుకావాలని డీఈఓ అందులో ఆదేశించారు.

కాలువ పూడ్చి.. దర్జాగా అక్రమ నిర్మాణం



బోయకొండ గంగాపురంలో ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం

- బోయకొండ గంగాపురం వద్ద ఆక్రమణ
- పట్టించుకోని రెవెన్యూ శాఖ అధికారులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ వద్ద గంగాపురంలో ప్రభుత్వం స్థలం ఆక్రమించి అక్రమ నిర్మాణం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. గత ప్రభుత్వం ఇక్కడ ఆక్రమణలు తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించింది. ఇక్కడ గదులు పొందిన వారు వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ మూలాన ఇక్కడి స్థలాలకు విలువ పెరిగింది. ఇదే అవకాశంగా ఆక్రమణదారులు బరితెగించారు. దేవిరెడ్డి చెరువుకు వర్షపు నీరు వచ్చే రాజకాలువను పూడ్చి దర్జాగా షెడ్డు నిర్మిస్తున్నారు. కొన్నిరోజులుగా చేస్తున్న పనులు ముగింపు దశకు చేరుకుంటున్నా ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాలిబన్లను తలపిస్తున్న కూటమి పాలన

- దాడులు, హత్యలతో సరికొత్త విష సంస్కృతి
- బాధితులపైనే కేసుల నమోదు దుర్మార్గం
- జీడీ నెల్లూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి విమర్శ



కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు మొదలుకుని కార్యకర్తల వరకు దాడులు, ఆస్తుల ధ్వంసం, ఇళ్ల కూల్చివేత, హత్యలు, చిన్నారులు, మహిళలపై లైంగికదాడులు పెరిగిపోయాయని గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగం, అరాచక పాలనతో టీడీపీ నేతలు తాలిబన్లను తలపిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు లేవని, కూటమి ప్రభుత్వం దాడులతో సరికొత్త విష సంస్కృతిని పెంచిపోషిస్తోందని దుయ్యబట్టారు. పుంగనూరులో టీడీపీ మూకలు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్పపై రాళ్లదాడి చేసి, రెడ్డెప్ప కారుకు నిప్పు పెట్టి, ఇంటిని ధ్వంసం చేస్తున్నా, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడినా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం దారుణమన్నారు. ఈ దాడుల వెనుక ఎవరున్నారో రాష్ట్ర ప్రజలకు తెలుసున్నారు. వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీకి చెందిన జిలాని ప్రజలందరూ చూస్తుండగా పాశవికంగా హత్య చేసినా ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులతో పేట్రేగిపోతున్నారని, కూటమి ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా రోడ్ల మీద తిరిగే పరిస్థితి లేదన్నారు. టీడీపీకి ఓటు వేయలేదని శ్రీరంగరాజపురం మండలంలోని పుల్లూరు దళితవాడపై పచ్చమూకలు దాడులు చేసి గాయపరచారని, ఆస్తి నష్టం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై కాకుండా బాధితులపైనే కేసు నమోదు చేయడం దుర్మార్గమని నిరసించారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, హత్యలు, దారుణ కృత్యాలపై ఉన్నత న్యాయస్థానం సుమోటోగా స్వీకరించి విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్లకు దారిలేకుండా జేసీబీతో ధ్వంసం

- సీఐ, ఆర్డీఓకు బాధితుల ఫిర్యాదు



వీధిని జేసీబీతో తవ్వేస్తున్న దృశ్యం

పలమనేరు: గ్రామంలోని పది ఇళ్లకు దారిలేకుండా సీసీ రోడ్డును జేసీబీతో ధ్వంసం చేసి, ప్రజల రాకపోకలకు ఆస్కారం లేకుండా గొయ్యి తీశారని గంగవరం మండలం కొంగోళ్లపల్లెకు పలువురు బాధితులు శుక్రవారం రాత్రి గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు వెంకటరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, రాణెమ్మ తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో తమ గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైన్‌ను వేశారన్నారు. ఆ ప్రభుత్వ భూమి తమ స్థలంటూ గ్రామానికి చెందిన హేమనాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి జేసీబీతో దారిని తవ్వి, డ్రైన్‌ను సైతం ధ్వంసం చేశారని తెలిపారు. దీనిపై ఆర్డీఓకు సైతం ఫిర్యాదు చేశామన్నారు. వారి చర్యల మూలాన పశువులను దొడ్లలోకి తీసుకెళ్లే పరిస్థితి లేక వీధుల్లోనే కట్టేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సిగరెట్ ఇమ్మని.. తాళిబొట్టు లాక్కొని..!

- ఉడాయించిన చైన్ స్నాచర్లు

చిత్తూరు అర్బన్: సిగరెట్ ఇమ్మంటూ వచ్చి తాళిబొట్టు లాక్కెళ్లా దేవుడా..అని ఓ మహిళ లబోదిబోమంది. వివరాలు.. సంతపేటలోని ఆశ్రమం వీధికి చెందిన జ్యోతి స్థానికంగా ఓ చిన్న దుకాణం పెట్టుకుని జీవిస్తోంది. శుక్రవారం సాయంత్రం ఇద్దరు ఆగంతకులు ద్విచక్రవాహనంపై వచ్చి సిగరెట్ అడిగారు. దాన్ని తీసి ఇస్తుండగా ఓ వ్యక్తి మొహానికి మాస్కు వేసుకుని, జ్యోతి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కోగా, అప్పటికే బైకు స్టార్ట్ చేసి సిద్ధంగా ఉంచిన వ్యక్తితో కలిసి పారిపోయాడు. మెడలో ఉన్న 32 గ్రాముల తాళిబొట్టు పోగొట్టుకున్న మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్

దరఖాస్తు చేసుకోవాలన్న కలెక్టర్



కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్‌స్కీమ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను పొడిగించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అక్రిడిటేషన్ కలిగిన వర్కింగ్ జర్నలిస్టులు www.cfms.ap.gov.in వెబ్‌సైట్‌లో రూ.1250 చెల్లించాల్సి ఉంటుందన్నారు. జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్యం కలిగితే ప్రతిసారీ రూ.2 లక్షల వరకు ఈ స్కీమ్ కింద వైద్యసేవలు పొందే అవకాశం ఉందన్నారు. ఇలా సంవత్సరంలో ఎన్ని సార్లైనా వైద్యసేవలు పొందవచ్చన్నారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలోనే జర్నలిస్టులకు వైద్యసేవలందిస్తారన్నారు. వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు ఉండవని తెలిపారు. నిర్దేశిత చికిత్సలకు ఉచిత ఓపీ సేవలు పొందవచ్చన్నారు. ఈ స్కీమ్ 2025 మార్చి 31 వరకు వర్తిస్తుందన్నారు హెడ్ ఆఫ్ అకౌంట్ 8342-00-120-01-03-001-001, డీడీఓ కోడ్ 2703-0802-003 కు చలానా నగదు చెల్లించాలన్నారు. ప్రీమియం నగదు చెల్లించే జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జెరాక్సు, హెల్త్‌స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డుల జెరాక్సులను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో పనివేళల్లో అందజేయాలని సూచించారు.